డేగ కన్ను చూస్తోంది

• ఆకతాయిలు, మందుబాబులపై డ్రోన్ కెమెరాలతో నిఘా • బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు • కార్డన్‌సెర్చ్‌తో బెల్టు దుకాణలపై కొరడా


గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో డ్రోన్ కెమెరా తో నిఘా


కొత్తపాలెం ప్రాంతంలో డ్రోన్ ద్వారా మద్యం సేవించే వారిని పట్టుకున్న దృశ్యం

గోపాలపట్నం: ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టడానికి గోపాలపట్నం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలైన కొత్తపాలెం, ఏడుమదుములు వంటి ప్రాంతాల్లో గంజాయి సేవించడం... మందుబాబులు తాగి అలజడి సృష్టించడం వంటి ఘటనలు వెలుగులోకి రావడంతో అప్రమత్తమయ్యారు. సీఐ ఎస్వీ ప్రభాకర్ తొలుత సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలు.. మందుబాబులు ఉండే ప్రాంతాలను సందర్శించారు. ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని నియమించడంతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా మందు బాబులకు చుక్కలు చూపిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా

గోపాలపట్నం శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల కొత్తపాలెం జంక్షన్‌లో బహిరంగంగా మద్యం సేవించిన వారిపై కఠినంగా వ్యవహరించారు. మందుబాబుల బెడద తగ్గించేలా చర్యలు చేపట్టారు. భగత్‌సింగ్‌నగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా మందుబాబులను పట్టుకుని కేసులు నమోదు చేశారు. వెస్ట్ సబ్ డివిజన్‌లో డ్రోన్ నిఘాతో తొలి కేసు నమోదు చేశారు. బహిరంగ ధూమపానం, పోకిరీలపై కూడా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు.

కార్డన్ సెర్చ్‌తో...

కార్డన్ సెర్చ్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమంగా మద్యం కలిగి ఉన్న వారితో పాటు వాహనాల రికార్డులు సక్రమంగా లేకపోతే సీజ్ చేస్తున్నారు. అనుమానితులు కనిపిస్తే కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు వారి నుంచి తగిన ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గోపాలపట్నం ఇందిరానగర్, లక్ష్మీనగర్, వెంకటాపురం, పాత గోపాలపట్నం, కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేశారు. నలుగురు బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు.

సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదం



సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి, డ్రగ్స్ కలిగి ఉండడం నేరం. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. గోపాలపట్నం స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు, మద్యం, గంజాయి సేవించే ప్రాంతాలను గుర్తించాం.వాటిపై కూడా నిఘాపెడుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడినా.. గంజాయి, డ్రగ్స్ వంటి ఆనవాళ్లు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– ఎస్వీ ప్రభాకర్, సీఐ గోపాలపట్నం

అంబులెన్స్ వెళ్లే దారేది?

సాక్షి ఎఫెక్ట్..


మార్కెట్ రోడ్డులో ఇరుక్కున్న అంబులెన్స్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలో వ్యాపారులు సర్వీస్ రోడ్డును ఆక్రమించడంతో అత్యవసర సమయంలో రోగిని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు కూడా మార్గం లేక ఇబ్బంది పడాల్సి వచ్చింది. వివరాలివి.. మంగళవారం ఉదయం మార్కెట్ వీధి సమీపంలోని శెట్టిబలిజవీధి వద్ద ఓ మహిళకు అనారోగ్య సమస్య తలెత్తింది. ఆ మహిళను వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌ను ఆశ్రయించారు. ఆ అంబులెన్స్ మార్కెట్ రోడ్డుకు వచ్చి, హారన్ మోగించినా వ్యాపారులు సర్వీస్‌రోడ్డుపై పెట్టిన తమ సామగ్రి తీసి, అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదు. దీంతో అంబులెన్స్ ఆ ఇరుకులో చాలాసేపు నిలిచిపోవాల్సి వచ్చింది. చివరికి మార్కెట్ రోడ్డు తరువాత గల కృష్ణ బార్ రోడ్డు మార్గంలో అంబులెన్స్‌ను తీసుకువచ్చి, ఆ రోగిని ఆస్పత్రికి తరలించారు. వ్యాపారులు తమ షాపు హద్దుకంటే అనధికారికంగా సేవామార్గాన్ని ఆక్రమించడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, వాహనాల రాకపోలకు మార్గం సుగమం చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌టీఎల్ ల్యాబ్‌రైజింగ్ డే

రక్తదానం చేసిన ఉద్యోగులు, శాస్త్ర వేత్తలు


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, శాస్త్ర వేత్తలు

గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరి 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఎన్‌ఎస్‌టీఎల్ కుటుంబ సంక్షేమ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనడం మంచి విషయమన్నారు. రక్తదానం చేసిన వారంతా ప్రాణదాతలేనని కొనియాడారు. 160 మంది ఉద్యోగులు రక్తదానం చేశారని తెలిపారు. శిబిరానికి సహకరించిన ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంక్ యాజమాన్యానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఎస్‌టీఎల్ సామాజిక సేవా కమిటీ చైర్మన్ జీఎస్‌పీఎస్ కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి గౌరవ్‌కుమార్, లాబ్‌రైజింగ్‌డే–2025 చైర్మన్ డాక్టర్ పీకే పట్నాయక్, అప్పారావు, పద్మజ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఆర్టీయూ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

మల్కాపురం: పీఆర్‌టీయూ ములగాడ మండల సర్వసభ్య సమావేశాన్ని జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం నిర్వహించారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాహిర్ అన్సారీ, అధ్యక్షుడిగా బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వై.ఫణీంద్రకుమార్, మహిళా అధ్యక్షురాలిగా భారతి, కోశాధికారిగా వసంతకుమారి, జీవీఎంసీ ప్రతినిధిగా బి.స్రవంతిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా కె.నాగేశ్వరరావు, పి.హరికృష్ణ, ఎం.లక్ష్మణరెడ్డి వ్యవహరించారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ


విద్యార్థులకు పరికరాలు అందిస్తున్న బౌద్ధ ప్రచారకులు ధర్మానంద

మల్కాపురం: విద్యార్థి దశ నుంచే క్రీడలపై శ్రద్ధ చూపాలని రామచంద్ర బౌద్ధారామానికి చెందిన బౌద్ధ ప్రచారకులు ధర్మానంద అన్నారు. నచ్చిన క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. 58వ వార్డు శ్రీహరిపురంలోని జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన క్రీడాపరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రియదర్శిని, ఉపాధ్యాయులు కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో తెలుకులవీధి


తెలుకుల వీధిలో వెలగని వీధి లైటు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం తెలుకులవీధిలో వీధి లైట్లు మూడు రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో చీకటి పడితే ఆ మార్గంలో అంధకారం అలుముకుంటుంది. సమస్యను జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బందికి వివరించినా ఫలితం లేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విజయవంతంగా ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి


శిక్షణలో పాల్గొన్న వారితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: త్వరలో జరగనున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కోసం హౌస్ హోల్డ్ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా సర్వే చేయాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ ఈ సర్వేకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీహరి, పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు

సింహాచలం: సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో భక్తులకు అందించే అన్నప్రసాదం నాణ్యతగా ఉండాలని, అందులో ఎలాంటి రాజీ పడొద్దని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నప్రసాద విభాగం అధికారులకు సూచించారు. అన్నప్రసాద భవనంలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. భక్తులకు వడ్డించే అన్నంతో పాటు సాంబారు, కూర, మజ్జిగ రుచులను పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యత ఎలా ఉందో.. భక్తులను అడిగి తెలుసుకున్నారు.

ప్రేమసమాజం సేవలు మహోన్నతం


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కుష్టువ్యాధి గ్రస్తులు

అల్లిపురం: ప్రేమ సమాజం కుష్టు శరణాలయ 71వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ ఎన్.ఎస్.రాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రేమసమాజం చేపడుతున్న సేవలన్నింటి కంటే కుష్టు రోగులకు ఆశ్రయం కల్పించి వారికి సేవలందించడం అన్నింటికంటే మహోన్నతమైనదని తెలిపారు. సభాధ్యక్షుడు కేశప్రగడ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రేమ సమాజం 1955 నుంచి కుష్టు వ్యాధితో బాధపడుతున్న అనేక మంది రోగులను అక్కున చేర్చుకుని వారికి ఆశ్రయం కల్పిస్తూ, సపర్యలు చేస్తుందన్నారు. 1956లో చెవిడి రాణి ప్రేమసమాజం చేస్తున్న సేవలను గుర్తించి ఏవీఎన్ కళాశాల దరి స్థలాన్ని ఉచితంగా అందించారని తెలిపారు. 200 మంది రోగులతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు పది మంది మాత్రమే మిగిలారన్నారు. మిగిలివాన వారు ప్రేమసమాజం సేవల వల్ల కోలుకుని ఇళ్లకు వెళ్లిపోవడం గర్వకారణం అన్నారు. అనంతరం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి అతిథులు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి. మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి పి.లక్ష్మీగుప్తా, లంకాడ వెంకట్రావు, చోడవరం శాఖ కార్యదర్శి సరగడం సత్యనారాయణ, ఆశ్రమ వాసులు, బాలబాలికలు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు


కార్యక్రమంలో పాల్గొన్న సీపీ డాక్టర్ బాగ్చి, డాక్టర్ వాణి తదితరులు


మహిళా కానిస్టేబుల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సుమారు 4 వేల మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు 'వార్షిక పోలీసు ఆరోగ్య పరీక్ష 2.0' కార్యక్రమం మంగళవారం కేజీహెచ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ప్రతి రోజూ సుమారు 120 నుండి 150 మంది పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగించనున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణరావు, కేజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణన్, డాక్టర్ యు. శ్రీహరి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1, గ్రేడ్–2 పాల్గొన్నారు.

ఇది నయవంచక ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్


హాజరైన కార్యకర్తలు, ప్రజలు

- సంక్షేమ పథకాల్లో కోత పెడుతున్నారు
- కూటమికి ప్రజా తిరుగుబాటు తథ్యం
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్
- 52వ వార్డులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

విశాఖ విద్య: ఇది కూటమి ప్రభుత్వం కాదు.. నయవంచక ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాస రామాలయం వద్ద మంగళవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని జియ్యాని మారుతీరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగితే.., మీ నాలుక మందం అని ఎదురు దాడి చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అందరికీ తల్లికి వందనం అని చెప్పి కొందరికే ఇచ్చారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఏడాదికి రూ. 18 వేలు అని చెప్పి నిండా మోసం చేసిందన్నారు.

నాడు ఇంటికే సంక్షేమ పథకాలు

సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్లకు పంపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసి సామాన్యులకు ప్రభుత్వ సేవలను దూరం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే విద్యు చార్జీల భారం తగ్గిస్తామని చెప్పి స్మార్ట్ మీటర్లు పేరుతో పేద ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఇలాంటి అంశాలపై ప్రశ్నిస్తే అన్యాయంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు

కూటమి మోసాలను తిప్పికొట్టాలి

ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం అమలు చేయకపోవడంతో ఫీజులు కట్టలేక పేద విద్యార్థులకు చదువులకు దూరం అవుతున్నారని, దీనిపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జియ్యాని విజయ్, శ్రీదేవివర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపుల్ల



మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధిని కూటమి నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. పార్కు దగ్గర దుకాణాలను కక్ష కట్టి కూల్చి వేయించి పేదలను రోడ్డుమీదకు నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిక్షాకాలనీ, సంజీవనగర్‌లో బోర్ల నిర్మాణాన్ని అడ్డుకొని దళితులనుతీవ్రంగా అవమానించారన్నారు. అభివృద్ధి పనులు చేయడానికి వీల్లేదని మహిళా అధికారులకు కూటమికి చెందిన ఓ చోటా నాయకుడు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. రాత్రి వేళ కూడా మహిళా అధికారులకు ఫోన్ చేయాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు.

మీటింగ్‌కు రాకుండా బెదిరింపులు

బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఎవరకూ వెళ్లకూడదని వార్డు ప్రజలను కూటమి నాయకులు బెదిరించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ అన్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలని హితవుపలికారు. రాజకీయం హుందాగా చేయాలన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై శిక్షణ


సముద్రపు నాచు ఉత్పత్తుల గురించి మత్స్యకారులకు వివరిస్తున్న అధికారులు

మహారాణిపేట: సముద్రపు నాచు పెంపకంపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార యువతీ, యువకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. బీచ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ (సిఫ్ నెట్) కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. నాచు పెంపకానికి అనువైన ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. సముద్రపు నాచులో అనేక రకాలు ఉన్నాయని, ట్యూబ్, రాఫ్ట్ పద్ధతిలో నాచు పెంపకం, సముద్రపు నాచు ఎండబెట్టడం వంటి వాటిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా మార్కెటింగ్‌పై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. దీనిపై మత్స్యకార యువతకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. సీఫ్‌నెట్ ఇన్‌చార్జి డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సముద్రపు నాచుతో తయారు చేసే పలు ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్‌ఆర్‌ఐ) శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్ మేఘరాజన్, డిప్యూటీ డైరెక్టర్ హెచ్.బిషోయ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (ఎన్‌ఐఎఫ్‌పీహెచ్‌ఏటీటీ) డి.డి. డాక్టర్ మీనా కోటేశ్వరరావు, డాక్టర్ రమ్య, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, ఎఫ్‌డీవో ఆషాజ్యోతి, డీసీఎం కృష్ణ, గరికిన రవి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం కోసమే సీవీ రచనలు



మాట్లాడుతున్న ఆచార్య కేఎస్ చలం

సీతంపేట : సమతా సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ప్రముఖ రచయిత చిత్తజల్లు వరహాలరావు (సీవీ) సాహిత్యంపై పరామర్శ సభ నిర్వహించారు. రచయిత డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం సీవీ రచనలు సాగించారన్నారు. డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సీవీ రచనల్లోని సామాజిక విషయాలపై ప్రసంగించారు. డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ సీవీ రచనల ప్రాసంగిత నేటికీ అవసరమన్నారు. డాక్టర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ సీవీ సాహిత్యం మీద విస్తృత ప్రచారం, పరిశీలన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, వేమన, మహేష్, చిన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఏకాదశి తిరువీధి వైభవంగా జరిగింది. ఆలయంలో కొలువుదీరిన మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం బేడామండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. పారాయణాలు పఠించారు. విశేషంగా హారతి అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ వైర్లు సర్దుబాటు


వైర్లు సరి చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ గెడ్డకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలపై వైర్లు పిచ్చిక గూళ్లు మాదిరిగా ఉన్నాయి. దీంతో తరచూ ఇక్కడ షార్ట్ సర్క్యూట్ సమస్య తలెత్తుతోంది. సమస్యను కాలనీ వాసులు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించారు. విషయాన్ని ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావుకు వివరించారు.దీంతో ఆయన సిబ్బంది సాయంతో ఏకేసీకాలనీ గెడ్డకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలపై వైర్లను సరి చేశారు. దీంతో స్థానికులు కార్పొరేటర్ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో డ్రైవర్లకు నష్టం


ధర్నాలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరలు, విడిభాగాల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో రోజంతా ఆటో నడిపినా పూట గడవడం కష్టంగా ఉందన్నారు. దీనికితోడు ఉబర్, ఓలా, రాపిడోతో ఉపాధి కోల్పోతున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంపై పునరాలోచన చెయ్యాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావికృష్ణ, దేవుడు, రాంబాబు పాల్గొన్నారు.

28 నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నామని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఎఫ్‌డీపీ నిర్వహించనున్నామని వీసీ పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో దీనిని నిర్వహిస్తామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో బోధనా సిబ్బంది, పరిశోధకులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రంగంలో అధ్యాపకుల నైపుణ్యాలను మరింత పెంపొందించడం, వర్తమాన సమాజ అవసరాలు, సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే దిశగా పనిచేయడంపై శిక్షణ ఇస్తామన్నారు. ఎఫ్‌డీపీకి ఐఐటీ ఆచార్యులు, ఎన్‌ఐఎస్ఈఆర్ భువనేశ్వర్‌కు చెందిన శాస్త్రవేత్తలు, విభిన్న పరిశ్రమల నిపుణులు పాల్గొని శిక్షణ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, కార్యక్రమాల కన్వీనర్ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.